


# నవభూమి

జిల్లా అనుబంధం

23 జూన్ ,2025 సోమవారం పేజీలు:6

www.epaper.navabhoomi.in


# యానిమల్ కారిడార్‌గా మణుగూరు-కొత్తగూడెం రైల్వే మార్గం..!

- మణుగూరు-కొత్తగూడెం మార్గం ఇప్పుడు వన్యప్రాణుల రక్షణకు
- అటవీ శాఖ అప్రమత్తం అడవిదున్న మరణంతో చర్యలు వేగవంతం
- 48 కిలోమీటర్ల రైల్వే మార్గం గుండా దట్టమైన అడవులు
- బొగ్గు రవాణా, ప్రయాణికుల రైళ్ల రాకపోకలతో జంతువుల ప్రాణాలు ప్రమాదంలో
- 52 రకాల వన్యజీవులు రక్షణ కోసం ఫెన్సింగ్, మానిటరింగ్
- సీసీ కెమెరాలతో జంతువుల చలనం పర్యవేక్షణ, 200 సార్లు జంతువుల సంచారం గుర్తింపు
- జీవవైవిధ్యం కాపాడేందుకు కీలకమైన యానిమల్ కారిడార్
- ఆవాస విభజన నివారణ జన్యు పరిరక్షణకు సహాయంగా మారనున్న రైల్వే మార్గం

**కొత్తగూడెం-నవభూమిప్రతినిధి**

తెలంగాణలోని మణుగూరు-కొత్తగూడెం రైల్వే మార్గాన్ని వన్యప్రాణి కారిడార్‌గా గుర్తించేందుకు అటవీ శాఖ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల రైలు ప్రమాదంలో అడవిదున్న మృతి చెందిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. 48 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ మార్గంలో 52 రకాల జంతువులు సంచరిస్తున్నట్లు గుర్తించారు. కారిడార్ ఏర్పాటుతో వన్యప్రాణులకు రక్షణ కల్పించనున్నారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, జంతువుల సంచారాన్ని పర్యవేక్షించనున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

యానిమల్ కారిడార్‌గా మణుగూరు-కొత్తగూడెం రైల్వే మార్గం..! దీని వల్ల ఉపయోగం ఏంటంటే.. ( తెలంగాణలోని మణుగూరు-కొత్తగూడెం (భద్రాచలం రోడ్) మధ్య ఉన్న రైల్వే మార్గాన్ని వన్యప్రాణి కారిడార్‌గా గుర్తించే ప్రయత్నాలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ కీలక నిర్ణయం అడవుల గుండా వెళ్లే రైలు మార్గాల వల్ల వన్యప్రాణులకు తలెత్తుతున్న ప్రమాదాలను నివారించడంలో.. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో గణనీయమైన ముందడుగు. ఇటీవల మణుగూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఒక అడవిదున్న రైలు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందడంతో.. అటవీ శాఖ అధికారులు ఈ విషయంలో మరింత అప్రమత్తమయ్యారు. ఇలాంటి విషాద సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని వారు పట్టుదలగా ఉన్నారు. మణుగూరు, కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, కిన్నెరసాని డివిజన్ల పరిధిలో లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం గుండా 48 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే లైన్ వెళు ంది. ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లతో పాటు, సింగరేణి నుంచి బొగ్గు రవాణా చేసే గూడ్సు రైళ్లు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే లైన్లు అటవీ ఆవాసాలను ఛిన్నాభిన్నం చేసి, వన్యప్రాణుల స్వేచ్ఛా సంచారాన్ని అడ్డుకోవడమే కాకుండా, వాటికి ప్రత్యక్ష మరణాలకు కారణమవుతాయి. అందువల్ల, అడవుల గుండా వెళ్లే రైల్వే మార్గాలకు వన్యప్రాణి కారిడార్లు అత్యవసరం. ఇవి జంతువులు సురక్షితంగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లేందుకు వీలు కల్పిస్తాయి.. తద్వారా వాటి ఆవాసాల విభజనను నిరోధించి, జన్యు వైవిధ్యాన్ని కాపాడతాయి. వన్యప్రాణుల సంచారంపై అవగాహన పెంచుకోవడానికి అటవీ శాఖ అధికారులు రైలు మార్గంలో ఒక సమగ్ర సర్వేను నిర్వహించారు. ఈ నివేదికను వైల్డ్‌లైఫ్ కన్సర్వేషన్ డిపార్ట్‌మెంట్‌కు



సమర్పించారు. అక్కడి నుంచి ఇది రైల్వే శాఖ ఉన్నతాధికారులకు వెళ్లనుంది. సర్వే వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. నెల రోజుల పరిశీలనలోనే సుమారు 52 రకాల జంతువులు, వివిధ పక్షులు ఈ ప్రాంతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, 110 సీసీ కెమెరాలను ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, దాదాపు 200 సార్లు జంతువులు, పక్షులు సంచరించిన దృశ్యాలను నమోదు చేశారు. ఈ దృశ్యాలను వన్యప్రాణుల డిపార్ట్‌మెంట్‌కు అందజేశారు.




# కరెప్షన్‌పై కలెక్టర్ సీరియస్

- ఏసీబీ దాడుల నేపథ్యంలో యంత్రాంగంపై క్రమశిక్షణ చర్యలు!
- లంచం లెక్కిస్తూ సోషల్ మీడియాకు చిక్కిన అశ్వాపురం తహసీల్దార్‌పై వేటు
- కలెక్టరేట్‌కు 'రాజారావు' అటాచ్.. అశ్వాపురానికి ఐటీడీఏ ఆర్‌వోఎఫ్‌ఆర్ డీటీ
- బూర్గంపహాడ్ డిప్యూటీ తహసీల్దార్‌గా కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్
- ఐటీడీఏ ఆర్‌వోఎఫ్‌ఆర్ డీటీగా బూర్గంపహాడ్ డీటీ రాంనరేశ్‌కు స్థానచలనం
- లంచాలు, ఏసీబీ దాడుల నేపథ్యంలో 24 గంటల్లోపే భద్రాద్రి కలెక్టర్ యాక్షన్

**భద్రాచలం-నవభూమి:** భద్రాద్రి జిల్లాలోని రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సీరియస్‌గా పరిగణించారు. బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయ టైపిస్టు (కంప్యూటర్ ఆపరేటర్) రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కడం, ఏకంగా అశ్వాపురం తహసీల్దారే ఓ రైతు నుంచి లంచం తీసుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు అశ్వాపురం తహసీల్దార్‌పై బదిలీ వేటు వేశారు. ఈ మేరకు తన కార్యాలయానికే అటాచ్ చేసుకున్నారు.



ఇక అవినీతి అంశంలో చెరిగిపోని మచ్చ తెస్తూ వరుసగా ఏసీబీ అధికారులకు చిక్కుతున్న రెవెన్యూ కార్యాలయాల్లో ఇతర యంత్రాంగంపైనా బదిలీ వేటు వేశారు. ఇక సంచలనంగా మారిన అశ్వాపురం మండల రెవెన్యూ కార్యాలయానికి తహసీల్దార్‌గా భద్రాచలం ఐటీడీఏ ఆర్‌వోఎఫ్‌ఆర్ డీటీని పంపుతున్నారు. అలాగే, బూర్గంపహాడ్ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) రాంనరేశ్‌ను కూడా భద్రాచలం ఐటీడీఏ ఆర్‌వోఎఫ్‌ఆర్ డీటీగా బదిలీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్‌ను బూర్గంపహాడ్ డీటీగా పంపుతున్నారు. కాగా, లంచాలు, ఏసీబీ దాడులతో బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాల్లో రెవెన్యూ కార్యాలయాల ప్రతిష్ట మంటగలుస్తున్న నేపథ్యంలో 24 గంటల్లోపే ఆయా కార్యాలయాల యంత్రాంగంపై భద్రాద్రి కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

బూర్గంపహాడ్ కార్యాలయాల్లోని యంత్రాంగంపై భద్రాద్రి కలెక్టర్ సీరియర్ అయ్యారు. రేషన్ కార్డు ప్రాసెస్ కోసం ఓ దరఖాస్తుదారుడి నుంచి రూ.2,500 లంచం తీసుకుంటూ బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయ టైపిస్ట్ నవక్రాంత్ శనివారం ఏసీబీకి పట్టుబడిన విషయం విదితమే. అలాగే, అశ్వాపురం తహసీల్దార్ రాజారావు కూడా ఓ రైతు వద్ద లంచం తీసుకొని లెక్కిస్తూ సోషల్‌మీడియాకు చిక్కిన సంగతి తెలిసిందే. అశ్వాపురం మండలంలో మల్లెలమడుగు గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టాదారు పాస్‌పుస్తకంలో పేరు మార్పు కోసం దరఖాస్తుతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. ఆన్‌లైన్ చేయాలంటే రూ.7 వేలు ఇవ్వాలంటూ సదరు రైతును తహసీల్దార్ డిమాండ్ చేశారు.

తన వద్ద రూ.5 వేలే ఉన్నాయంటూ ఆ రైతు చెప్పడంతో ఆ నగదును తీసుకొని లెక్కిస్తూ.. 'మరో రూ.1000 ఇవ్వాలి' అంటూ తహసీల్దార్ అడిగిన విషయాన్ని పక్కనే ఉన్న మరో రైతు తన సెల్‌ఫోన్‌లో రికార్డుచేశాడు. ఆ వీడియో రికార్డును సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడంతో అది వైరల్‌గా మారింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సదరు తహసీల్దార్ రాజారావును కలెక్టరేట్‌కు అటాచ్ చేస్తూ కలెక్టర్ జితేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆయన స్థానంలో మణిధర్ సోమవారం విధుల్లోకి రానున్నారు. అయితే, అటు అశ్వాపురం, ఇటు బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి జలగల విషయం బయటపడిన 24 గంటల్లోనే ఆయా బాధ్యులపై భద్రాద్రి కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు.

అశ్వాపురం మండల వ్యవసాయ అధికారి సాయి శాంతన్‌కుమార్ కూడా మూడు నెలల క్రితమే ఏసీబీకి చిక్కారు. పత్తి కొనుగోలు కోసం ఓ రైతుకు టీఆర్ ఇవ్వడానికి అతడి వద్ద రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 20న సదరు ఏవో అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం విదితమే.

## కేయూ దూరవిద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**ఖమ్మం, నవభూమి, జూన్ 22:** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ ( గతంలో ఎస్ డి ఎల్ సి ఈ ) లో 2025-2026 డిగ్రీ, పీజీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బి బి ఏ, బి ఎస్ సి మ్యాథ్స్, లైబ్రరీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా పీజీ కోర్సుల్లో ఎంఏ తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, ఎకనామిక్స్, సోషియాలజీ, హిస్టరీ, రూరల్ డెవలప్మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, సోషల్ వర్క్, ఎం కామ్, ఎమ్మెస్సీ మాథ్స్, సైకాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎంసీఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ తోపాటు, డిప్లమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ మొత్తం 43 రకాల కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా జూలై 15వ తేదీ వరకు స్థానిక పిజి కళాశాల అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రం కేంద్రంలో కానీ సెల్ నెంబర్ 8008811998 ను, కేయూ దూరవిద్య వెబ్ సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యు. ఎస్ డి ఎల్ సి ఈ. కేయూ. కో. ఇన్ ను సంప్రదించాలని పేర్కొన్నారు. యు జి సి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు, ఆన్లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ సంస్థల నిబంధనలు, చట్టం మేరకు తరగతులు ఉంటాయని తెలిపారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే మాదకద్రవ్య రహిత సమాజం సాధ్యం

### ఇన్స్పెక్టర్ బాలకృష్ణ





**ఖమ్మం, క్రైం, నవభూమి, జూన్ 22:** సమాజాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని రేవతి సెంటర్ చెందిన యువత కు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక కవిత డిగ్రీ కాలేజ్ లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సరదా కోసం మొదలైన అలవాటు మత్తులోకి నెడుతుందన్నారు. గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత నేడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యాల బారినపడి మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు. సమాజంలోని మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఇప్పటికే పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు ప్రభావితమైన వారిని ఆ మహమ్మారి వ్యవసనాల నుండి బయట పడేసేందుకు డి ఎడిక్షన్ కేంద్రాలు కూడా నిర్వహించబడుతున్నాయన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్జ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత మాధకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల బానిసలై విముక్తిపొందిన వారితో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను గురించి తెలియజేసినట్లైతే , యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడవచ్చు అన్నారు .

# నిజాంపేటలో ఘనంగా ఉచిత క్యాన్సర్ పరీక్షలు

- రోటరీ క్లబ్, పోటు ప్రసాద్ సేవలను కొనియాడిన ఎమ్మెల్యే కోరం, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి
- భారీ ఎత్తున హాజరైన ప్రజలు
- కంటి పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే కోరం













**ఇల్లెందు జూన్ 21 నవభూమి ప్రతినిధి:** రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం సెంట్రల్ ఆర్ ఐ డిస్ట్రిక్ట్ 3150, హైదరాబాద్ ఎం ఎన్ జె క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ఆద్వర్యంలో శనివారం ఇల్లెందు మండలం నిజాంపేట గ్రామంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఘనంగా నిర్వహించారు. నిజాంపేట గ్రామ వాస్తవ్యులు, ప్రస్తుతం ఖమ్మంలో నివాసం ఉంటున్న పోటు ప్రసాద్ సహాయ సహకారాలతో ఆయన అనుచర వర్గం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల 14 ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య లు సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ అధ్యక్షన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య లు మాట్లాడుతూ రోటరీ క్లబ్, పోటు ప్రసాద్ లు నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు మంచి కార్యక్రమం అని కొనియాడారు. మనకు తెలియకుండానే మనలో అనేక జబ్బులు పేరుకుపోయి ఉంటున్నాయని, ఇలాంటి పరీక్షల అవేర్నెస్ ద్వారా కొంత ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే బయటపడే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చంద్ర అరుణ, ఇల్లెందు డాక్టర్ లు, సీనియర్ రొటేరియన్స్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ కల్పన, కందుల కొండల రావు, పేరసాని శ్రీనివాసరావు, స్థానికులు మాజీ ఉప సర్పంచ్ పోటు రవి, అమడగాని బిక్షం, మహ్మద్ సలీం, చుక్క నాగరాజు, డాక్టర్ యాకూబ్, రామల్ల మోహన్ రావు తదితరులు ఏర్పాట్లు చూసుకుని కార్యక్రమం విజయవంతానికి విశేషంగా కృషి చేశారు.

## కేయూ ఎన్జీఓ సంఘం ఎన్నికల్లో

# తిరుపతి ప్యానెల్‌దే విజయం



**ఖమ్మం, నవభూమి, జూన్ 22 :** కాకతీయ విశ్వవిద్యాలయంలో హోరా హోరీగా జరిగిన నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి అభ్యర్థిగా పోటీ చేసిన వల్లాల తిరుపతి ప్యానెల్ ఘన విజయం సాధించింది. అధ్యక్షులుగా పోటీ చేసిన బి నవీన్ 129 ఓట్లతో, ఉపాధ్యక్షులుగా పోటీ చేసిన మొహమ్మద్ యూనస్ 111 ఓట్లతో, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన వి తిరుపతి 152 ఓట్లతో, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజషన్ గా పోటీ చేసిన ఎ సతీష్ బాబు 129 ఓట్లతో, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజషన్ ఉమెన్ గా పోటీ చేసిన బి కృష్ణవేణి 24 ఓట్లతో, జాయింట్ సెక్రటరీ రిక్రియేషన్ గా పోటీ చేసిన టి ప్రభాకర్ 100 ఓట్లతో, ట్రెజరర్ గా పోటీ చేసిన టి దామోదర్ 130 ఓట్లతో విజయం సాధించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలోని సెనేట్ హాల్ లో జరిగిన ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కట్ల రాజేందర్ విజేతలకు ధ్రువీకరణ పత్రం అందించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్ సహాయ ఎన్నికల అధికారిగా నిర్వహించగా, పర్యవేక్షకులు కె శ్రీనివాస్, పలువురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, పర్యవేక్షకులు, నాన్ టీచింగ్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొని ఎన్నికల ప్రక్రియను ముగించారు. ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా ఉద్యోగులు, శ్రేయోభిలాషులు గెలిచిన నాయకులకు పూల మాలలు వేసి, విజయ తిలకం దిద్ది పరిపాలన భవనం ముందు మిఠాయిలు పంచి పెద్ద ఎత్తున టపాసులు కాల్చారు. అనంతరం గెలిచిన నాయకులను ఓపెన్ టాప్ వాహనంలో ఎక్కించుకొని పరిపాలన భవనం నుండి కేయూ రెండవ గేటు వరకు ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలని, అవాజ్ దో హమ్ ఏక్ హె అని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బూర నవీన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి,వారి సంక్షేమానికి నాయకులందరితో కలిసి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. విజయానికి సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, బంధువులు, శ్రేయోభిలాషులు పాల్గొనగా ఖమ్మం పీజీ కళాశాల సిబ్బంది విజేతలకు అభినందనలు తెలిపారు.

# టిడిపి తరపున బాధితుడికి ఆర్థిక సహాయం



**బూర్గంపాడు జూన్ 22 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలో మేకా నరసయ్య 2022వ సంవత్సరం ఆగస్టు నెలలో వరద సందర్భంగా పడవ ప్రమాదంలో చనిపోయాడు. మృతిని భార్య కుమారికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తానని ఆనాడు హామీ ఇచ్చారు. ఆ సందర్భంగా టిడిపి పార్టీ తరపున ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. చంద్రబాబు నాయుడుకి టిడిపి నేతలకు ఎప్పుడు రుణపడి ఉంటామని, వారికి వారి కుటుంబ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ మాజీ ఇన్చార్జి తాత మాధవి లత మాట్లాడుతూ చంద్రబాబు మాట నిలబెట్టుకుంటారని, అలాగే కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ఉంటుందని, బాధితులకు ఆర్థిక సహాయం అందజేయటంలో కీలకపాత్ర వహించిన అగ్ర నాయకులకు నియోజకవర్గ స్థాయి నాయకులకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## 26న హైదరాబాద్‌లో సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ



**బూర్గంపాడు జూన్ 22 నవభూమి:** జూన్ 26న హైదరాబాద్ లో సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రచార కార్యదర్శి ధరావత్ రాంబాబు నాయక్, బూర్గంపాడు మండల కార్యదర్శి భూక్య నరేష్ నాయక్ పిలుపునిచ్చారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్, రాష్ట్ర కో కన్వీనర్ బానోత్ హుస్సేన్ నాయక్ పరివేక్షణలో తలపట్టిన జూన్ 26 చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బూర్గంపాడు మండలలో పలు తండాలలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. బంజారా సమాజానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు మనమందరం ఏకతాటికి రావాలని బంజర సమాజాని, మరొక యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ధరావత్ సక్రు నాయక్, పెద్ద హచ్చు నాయక్, బాలు నాయక్, భూక్య ప్రేమ్ కుమార్ నాయక్, ఫుల్ సింగ్ నాయక్, శంకర్ నాయక్, కృష్ణా నాయక్, నాగేశ్వరావు నాయక్, సుజాత భాయ్, సేవరి భాయ్, పిట్టి బాయ్, సేవాలాల్ సేన మహిళ నాయకులు విద్యార్థి సంఘ నాయకులు యువసేన నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాకు ...ఇందిరమ్మ ఇల్లు ఇవ్వండి సార్



**బూర్గంపాడు జూన్ 22 నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు ఎంపికలో కొంత అవకతవకలు జరిగాయని ప్రజలు అభిప్రాయంవడుచున్నారు. ఇంద్రమ్మ ఇల్లు లేని వారికా, ఇల్లు ఉన్నవారికా, అధికారులు ఎలా ఎంపిక చేస్తున్నారు, పలుకుబడి, అండబలం పార్టీలో ఉన్న వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. బూర్గంపాడు మండలం వేపలగడ్డ పంచాయతీ కొమ్ము నకిరి పేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కనితి సునీత, తనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేని అధికారులు కోరుతూ తన ఆవేదన వ్యక్తం చేశారు. తాను చాలా బీద కుటుంబానికి చెందిన వారిగా, రేకుల ఇంట్లో నివసిస్తున్నట్లు, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అన్నీ ఉండి గృహాలు కలిగి వారికి ప్రాధనతిస్తున్నారని, మాలాంటి పేద వారికి ప్రభుత్వం అండగా ఉండి మొదటి ప్రాధాన్యత మాకు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను, అధికారులను వేడుకుంటున్నారు.

## ఇంటికో మనిషి.. శాఖకో బండితో కదలిరండి



**ఖమ్మం రూరల్, నవభూమి, జూన్ 22:** ఈనెల 26వ తేదీన పెద్దతండాలో నిర్వహించనున్న సిపిఐ 14వ మండల మహాసభకు ఇంటికో మనిషి... శాఖకో బండి...చొప్పున కామ్రేడ్స్ కదలి రావాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ మహాసభ ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానుందని అన్నారు. దీనికి పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు అవుతారన్నారని తెలిపారు. కామ్రేడ్స్ పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, 30వ డివిజన్ కార్యదర్శి బియ్యాల రాజు, 31వ డివిజన్ సహాయ కార్యదర్శి మేళ్లచెరువు రవి పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లిని అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు





**పాల్వంచ టౌన్ జూన్ 22 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం- జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండి పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండే కాక ఇతర జిల్లాల నుండి భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించారు. మరియు అన్నప్రా శనలు, వాహన పూజలు,తలనీలాలు, అమ్మవారికి ఒడి బియ్యం,చీరలు, కనుములు,తదితర మొక్కులను చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదములనుస్వీకరించారు. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి, పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు చీకటి కార్తీక్, పెండ్లి రాంరెడ్డి, చెవుగాని పాపారావు, దేవస్థాన సిబ్బంది, పర్యవేక్షించారు.

నేడు పెద్దమ్మ తల్లి ఆలయంలో రుద్ర హెూమం

మాస శివరాత్రి సందర్భంగా సోమవారం రుద్ర హెూమం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 వరకు స్వామి వారి కళ్యాణం ఆలయ గల యాగశాలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 6303408458 ల వారిని సంప్రదించాలన్నారు.దేవాలయ ఆవరణం లో నూతన గదుల నిర్మాణమునకు ఈ- టెండర్స్ ఆహ్వానంశ్రీ కనకదుర్గ దేవస్థానం( పెద్దమ్మ గుడి ) నందు నూతనంగా నిర్మాణం కాబడిన షాపింగ్ కాంప్లెక్స్ పై భాగంలో 12 గదులు నిర్మాణమునకు ఆన్ లైన్ లో %http://tender.telangana.gov.in% వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని. బిడ్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేదీ14.06.2025 బి బిడ్ డౌన్ లోడింగ్ ముగింపు (దాఖలు ) ఈనెల 30 వరకు మాత్రమే ఉందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజిని కుమారి తెలిపారు.

# నిరుద్యోగ భృతి ఇవ్వాలి

■డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దు

■పివైఎల్ జిల్లా కార్యదర్శి కోర్స రామకృష్ణ









**ములకలపల్లి జూన్ 22 నవభూమి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యోగులకు రూ.4వేలు భృతి చెల్లిస్తామని చెప్పి చెల్లించకుండా కాలయాపన చేస్తుందని పివైఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కోర్స రామకృష్ణ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆదివారం నాడు ములకలపల్లి మండలంలో ముత్యాలంపాడు గ్రామం పగడాల వెంకన్న నగర్ లో ప్రగతిశీల యువజన సంఘం మండల జనరల్ కౌన్సిలింగ్ సభలో ఆయన మాట్లాడరు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఉద్యోగ భర్తీలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఉద్యోగ క్యాలెండరు ప్రకటించినా, ఉద్యోగాలు మాత్రం భర్తీ చేయడం లేదన్నారు. కనీసం నిరుద్యోగ భృతి నాయనా అమలు చేయడం లేదని, కాంగ్రెస్ పాలన రెండేళ్లు పూర్తి కావస్తున్న ఇకనైనా ప్రభుత్వం మేల్కొని, నాటికి నిరుద్యోగ భృతిపై క్లారిటీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. యువత డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాల నుండి విముక్తి కావాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, వారి వైఫల్యాలను ప్రశ్నించకుండా యువతకు డ్రగ్స్ గంజాయి ఇతర మత్తు పదార్థాలకు యువతను బానిసలు చేస్తున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు. దేశంలో కోట్లాదిమంది యువకులు, ఉపాధి లేక రోడ్లపై నిరాశలై తిరుగుతున్నారని యువతకు ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని వారు అన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ మత విద్వేషాలతో ప్రజల మధ్య వైరుధ్యాలు పెంచడం జరుగుతుందని దేశంలో రాష్ట్రంలో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని వారిని అడ్డుకోవడంలో యువత ముందుండాలని పిలుపునివ్వడం జరిగింది. యువత ఉద్యోగాలు లేక బెట్టింగ్లకు డ్రగ్సులకు బానిసలై తిరుగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. రాష్ట్రంలో లక్షలాది ప్రభుత్వ కొలువులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని నిత్యవసరకులధరలు విపరీతంగా పెరుగుతున్నాయని మహిళలపై అత్యాచారలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో పాలకులు వైఫల్యం చెందారని, పాలకులు అనుసరిస్తున్న విధానాలపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సభ కు ఓరుగంటి శీను, వగెల వెంకటేష్ అధ్యక్షత నిర్వహించగా సంఘ మండల కార్యదర్శి పదం లక్ష్మణ్ రావు అమరవీరుల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సంఘ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా ఈసం అశోక్, పద్దం లక్ష్మణ్ రావు లను ఎన్నుకోవడం జరిగింది. కోశాధికారి కొద్రుం సాయి, ఉపాధ్యక్షులుగా వగ్గేలా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా కీసరి బాబురావు, సభ్యులుగా పోడియం కిరణ్ కుమార్, తెలం సోమయ్య మడకం రాజు, ఊకే ఆదినారాయణ, సవాళ్ల శివ తదితరులను కమిటీలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సభలో యువతరాన్ని ఉద్దేశి సిపిఎంఎల్ మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి కిషోర్, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నకిరేకంటి నాగేశ్వరరావు, సిఎల్సి జిల్లా కమిటీ సభ్యులు బండారు నాగేంద్రబాబు, పి ఓ డబ్ల్యు జిల్లా నాయకులు కల్లూరి పద్మ, నూప సరోజిని యువకులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ వై ఎల్ నాయకులు ఈసం శివ, తానం రాజకుమార్ ఈసం బాలరాజు, ఈసం విజయ్, కారం బాలరాజు, గడ్డం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఎర్రజెండానే భరోసా

■ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా

■ విజయవంతంగా అశ్వాపురంలో సిపిఐ పార్టీ 20వ మండల మహాసభ

**అశ్వాపురం జూన్ 22 నవభూమి:** అశ్వాపురం లో దోసపాటీ రంగారావు భారతి కళ్యాణ మండపంలో ఆదివారం ఎడెల్లి శ్రీను, రాయపూడి రాజేష్, తెల్లం వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సిపిఐ పార్టీ మండల 20వ సభల్లో ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ భూములకు నీరు అందించిన తర్వాతనే బయటకు తీసుకెళ్లాలని ఆయన అన్నారు. ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని, దేశ సంపదను మోడీ అమిత్ షా దోచుకుంటున్నారని, మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని అన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతముందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరి ఎన్ కౌంటర్లు చేస్తుండడం, మరోపక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్ కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని కోరారు. అలాగే



సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నరాటి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సైరెడ్డి పుల్లారెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మి కుమారి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, సిపిఐ మండల నాయకులు, అనంతనేని సురేష్, అనంతనేని శేఖర్, మేలపుర సురేందర్ రెడ్డి, కొండపర్తి ప్రసాద్, రాయపూడి రాజేష్, ఈనపల్లి పవన్ సాయి, కమటం సురేష్, అక్కెనపల్లి నాగేంద్రబాబు, దండి నాగేష్, సర్వకృష్ణ, ఏడెల్లి కమలాకర్, చెలికాని శ్రీనివాస్, రెడ్డిబోయిన వెంకన్న, మల్లబోయిన లింగయ్య, తేజావత్ జయమ్మ, తురక అచ్చమ్మ, బెజ్జనబోయిన నాగమణి, సిపిఐ కార్యకర్తలు అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ముత్తాపురంలో సురక్ష హాస్పిటల్ మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం





**గుండాల జూన్ 22 నవభూమి:** ఖమ్మం సురక్ష హాస్పిటల్ ఫిజీషియన్ కన్సల్టేషన్ ఎండి డాక్టర్ రుద్ర గౌతమ నరేష్ ఆధ్వర్యంలో గుండాల వార్తా వేదిక ప్రెస్ క్లబ్ సౌజన్యంతో.. ఆదివారం గుండాల మండలం ముత్తాపురం గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 160 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం బాగుంటేనే అందరూ ఆర్థికంగా బాగుంటారనే ఉద్దేశంతోనే సురక్ష హాస్పిటల్ ఉచిత వైద్య సేవలు అందించేందుకు సురక్ష హాస్పిటల్ హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రుద్ర గౌతమ నరేష్ తెలిపారు. డాక్టర్ భరత్ కుమార్, సురక్ష హాస్పిటల్ మేనేజర్ సైదేశ్వర రావు, ఎక్స్ జెడ్పిటిసి దొండపాటి రమేష్, పిఆర్ఓ నవీన్, వార్త వేదిక గుండాల ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు నరసింహారావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తవిడిశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎస్.కె షారోజ్, పల్లెర్ల రవి వర్మ, మంకిడి సుధాకర్, ఫార్మసీ ప్రేమ్ హాస్పటల్ సిబ్బంది మున్ని, ఉమా, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ రోగికి పాల్వంచ జనహిత ఫౌండేషన్ పదివేల వితరణ



**పాల్వంచ జూన్ 22 నవభూమి ప్రతినిది:** పట్టణ పరిధి లోని జానహిత ఫౌండేషన్ అధ్యక్షురాలు బేరా శ్రీ లక్ష్మీ అశ్వారావుపేట మండలం, నందిపాడు గ్రామంలో నివసిస్తున్న ఓ క్యాన్సర్ రోగి కిఆదివారం పదివేల నగదు అందించి తన మానవతాను చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే... అశ్వారావుపేట మండలము, నందిపాడు గ్రామంలో నివసిసిస్తున్న సౌలం కాంతారావు గత ఆరు నెలలుగా గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో భార్య సమ్మక్క, కాంతారావు ఇద్దరు కూలి పనికి వెళ్తేనే ఇల్లు గడిచేది. కాంతారావు అనారోగ్య కారణంగా సమ్మక్క కూడా తనను చూసుకోవటానికి ఇంటి వద్దనే ఉంటూకూలి పనికి వెళ్లడం లేదు ఇల్లు గడవడం కష్టంగా ఉంది. హైదరాబాదు హాస్పిటల్ కి వెళ్లి రావటానికి కూడా వారి దగ్గర రవాణా చార్జీలు కూడా లేవు చాలా కష్టంగా ఉంది అని చెప్పారు. దీంతో స్పందించిన జానహిత ఫౌండేషన్ అధ్యక్షురాలు బేరా శ్రీ లక్ష్మీ ఆదివారం నందిపాడు గ్రామానికి వెళ్ళి ఆ కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. జనహితా ఫౌండేషన్ అధ్యక్షురాలు బేరా శ్రీ లక్ష్మీ స్వయంగా వారి ఇంటికి వెళ్లి కలిసి వారికి సహాయం చేయడంతో ఆయా ప్రజల అభిమానాన్ని ఆమె చూరగొన్నారు.

# ఘనంగా బూర్గంపాడు జూనియర్ కళాశాల

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**బూర్గంపాడు జూన్ 22 నవభూమి:** బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల 1988-90 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా జరిగింది. జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాలు నుండి విద్యార్థులు తరలివచ్చారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు గత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉదయం కాలేజీలోని సరస్వతి మాతకు పూలమాల వేశారు. ఆ తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1988 90 బ్యాచ్ జూనియర్ కళాశాల విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు నలజాల వెంకటరావు అధ్యక్షతన పూర్వ విద్యార్థులు సమావేశమై కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తీర్మానించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు రాబోయే కాలంలో కూడా జరపాలని నిర్ణయించారు. ఈ బ్యాచ్ లోని పూర్వ విద్యార్థుల సమాచారాన్ని మరింతగా పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళన సమావేశంలో అప్పటి విద్యార్థి సంఘం నాయకులు నలజాల వెంకటరావు, తోటా కోటేశ్వరరావు, రెడ్డెం నరసింహారెడ్డి ఉమామహేశ్వరరావు, రామ్ లాల్, రామారావు, పి వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థి సంఘ నాయకులందరినీ ఘనంగా సన్మానించారు. తమకు చదువు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పాల్వంచలో నాటు సారాయి తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం పటిక పట్టివేత



**పాల్వంచ జూన్ 22 నవభూమి ప్రతినిది:** నాటు సారాయి తయారీ కి ఉపయోగించే 4,025 కేజీ ల నల్ల బెల్లం, 20 కేజీ ల పటికను ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. అనంతరం ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ డీసీ జి జనార్ధన్ రెడ్డి, ఏసీ గణేష్ , ఏఈఎస్ కె తిరుపతిల ఆదేశాల మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఎస్ ఐ శ్రీహరి రావు తన సిబ్బందితో ఆదివారం దమ్మపేట సెంటర్, పాల్వంచ నందు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బొలెరో పికప్ వాహనము నందు 4,025 కేజీల నల్ల బెల్లం, 20 కేజీ ల పటిక, 10 లీటర్ల నాటు సారాయి 2 సెల్ ఫోన్ లతో పాటు ఇద్దరు ముద్దాయి లను అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఎస్ హెచ్ ఓ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ తరలించారు. ఇట్టి తనిఖీలలో ఎస్ ఐ శ్రీహరి రావు, హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుల్స్ వెంకట్, హరీశ్, వీరబాబు పాల్గొన్నారు. మత్తు పదార్థాల రవాణా, వినియోగం గురించి ఏదైనా సమాచారం ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు డయల్ చేసి తెలియచేయాలనీ శ్రీహరి సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

**బీబీనగర్-నవభూమి:** వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందిన సంఘటన ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆదివారం జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలో చోటు చేసుకుంది. భువనగిరి పట్టణానికి చెందిన ఎర్రోజు రాజు (42), మోత్కూరు మండలం తిరుమలగిరికి చెందిన తంగళ్లపల్లి సత్యనారాయ ణ(50) శనివారం ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరి బైక్ గూడూరు టోల్ ప్లాజా వద్ద ముందుగా వెళుతున్న కారును ఢీకొట్టింది. ఆ ఇద్దరికి తీవ్రగా యాలయ్యాయి. పోలీసులు వీరిని దవాఖానకు తరలిస్తుండగా ఎర్రోజు రాజు మార్గం మధ్యలో మృతి చెందాడు. తం గళ్లపల్లి సత్యనారాయణ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# సండే బ్రిక్స్ ఛాలెంజ్ విజయవంతం







**కొత్తగూడెం జూన్ 22 నవభూమి ప్రతినిధి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించిన సండే బ్రిక్స్ ఛాలెంజ్ విజయవంతంగా సాగింది. బ్రిక్స్ ఛాంపియన్ కొరకు పోటా పోటీగా యువత ముందుకొచ్చిది.వారి ఉత్సాహంతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అందరినీ ఛాంపియన్స్ గా గుర్తించారు.ఈ సెషన్ ప్రారంభానికి ముందే పోటీకి అవసరమైన మిషన్లు, మట్టి, ఇసుక, సిమెంట్, నీరు, నీడ, తాగునీటి ఏర్పాట్లతో సహా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేశారు. ఆరుగురు చొప్పున గుంపులు ఏర్పడి, ఏడు మిషన్లపై 168 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ఒక్కో మిషన్ దగ్గర ఒక డీపీఎం, ఉద్యోగిని ఇన్‌చార్జ్‌గా నియమించి వారిని మార్గనిర్దేశనం చేస్తూ, సాంకేతిక సహకారం అందించారు. వారు తమ జట్లను ప్రోత్సహిస్తూ, మిశ్రమం తయారీ, బ్రిక్స్ రూపొందించడంలో సహకరించారు. ఇది ప్రతి బృందంలోని సభ్యుల్లో టీం వర్క్, ఐక్యత, ఉత్సాహాన్ని పెంచింది.ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతి మిషన్ వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలిస్తూ ఎలా చేస్తున్నారు? ఇంకా మెరుగుగా ఎలా చేయాలో సూచనలు ఇచ్చారు. తాను స్వయంగా కూడా పాల్గొని, యువతలో మరింత స్ఫూర్తిని నింపారు. దీనికి బెంగుళూరు నుంచి వచ్చిన సీఎస్ ఈ బి నిపుణులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించారు. చివరగా పోటీలో పాల్గొన్న వారందరినీ విజేతలుగా ప్రకటిస్తూ టీ షర్టు, క్యాప్‌లు కలెక్టర్ అందజేశారు. ఇలాంటి వినూత్నమైన కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల పాల్గొన్న ప్రతి ఒక్కరు ఆనందాన్ని సంతృప్తిని వ్యక్తం చేశారు.కలెక్టర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులూ వర్క్‌షాప్‌లో నైపుణ్యాలను ఆకళింపు చేసుకున్నారురెండవ సెషన్‌లో జిల్లాలోని ప్రభుత్వ శాఖల నుండి సుమారు 300 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మెప్మా బృందాలు, ఐకెపి సీసీలు, ఏపీఎంఎస్ సభ్యులు పాల్గొన్నారు.

బెంగళూరుకు చెందిన సాంకేతిక నిపుణుడు సుధాకర్ రెడ్డి గారు వివిధ రకాల మట్టికి తగిన నిష్పత్తిలో ఇసుక, సిమెంట్, సున్నం, నీరు కలపడం ఎలా అన్న విషయాన్ని సవివరంగా వివరిస్తూ ం ప్రత్యేకంగా జిల్లాలో లభించే మట్టులకు ఏ మోతాదులు సరిపోతాయో వివరించారు. వారు ప్రతి సందేహానికి సున్నితంగా, ఆచరణాత్మకంగా సమాధానాలు అందించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ టెక్నిక్‌ను అర్థం చేసుకుని, స్వయంగా మిశ్రమం తయారు చేసి బ్రిక్స్ తయారుచేయడం ద్వారా నైపుణ్యం సాధించారు. వారు కూడా ప్రాక్టికల్ గా బ్రిక్స్ తయారు చేసి వారి సందేహాలను ప్రాక్టికల్ గా తీర్చుకోవడం వలన జిల్లాలోని ప్రతి ప్రాంతంలో అవగాహన కల్పించడంలో ఎంతో ఉపయోగపడుతుంది అని పేర్కొన్నారు.ఈ సెషన్‌లోనూ కలెక్టర్ ప్రతి మిషన్ వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ ప్రోత్సహించారు.అనంతరం ఈ రెండు సెషన్లు పూర్తిగా విజయవంతంగా పూర్తి కావడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు, విద్యాశాఖ, డి ఆర్ డి ఏ, మెప్మా బృందాలు, మున్సిపాలిటీ సిబ్బంది, ఉద్యోగులు మరియు స్వయం సహాయక బృందాల ఐక్యత, సమన్వయం వలన ఈ వినూత్న కార్యక్రమం ప్రజలలో నూతన శక్తిని నింపిందని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అవగాహనతో పాఠశాలల ప్రహరీ గోడలు, వంటగదులు, మూత్రశాలలు వంటి అవసరాలను తక్కువ ఖర్చుతో, పర్యావరణ హితంగా తీర్చవచ్చని స్పష్టంచేశారు.

# యువత భాగస్వామ్యం కావాలి




**ఖమ్మం, క్రైం, నవభూమి, జూన్ 22:**మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని ఖమ్మం త్రీ టౌన్ ఇన్స్‌పెక్టర్ మోహన్ బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఖమ్మం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్ లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వలభవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు.

# సిపిఐ పార్టీ నూతన మండల కార్యవర్గ ఎన్నిక

## మండల కార్యదర్శిగా గుండె పిన్ని వెంకటేశ్వర్లు






**జూలూరుపాడు, జూన్ 22 (నవ భూమి ప్రతినిధి):** భారత కమ్యునిస్టు పార్టీ (సి పి ఐ)మండల కార్యదర్శిగా గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా నాగుల్ మీరా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శనివారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ పార్టీ 13వ మహాసభలో రాబోయే మూడు సంవత్సరాల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులను 71 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన మండల కార్యదర్శి మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి శాయ శక్తుల కృషి చేస్తామని పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగకుండా పోరాటం చేస్తామన్నారు. తనకు తిరిగి కార్యదర్శి గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# కనకదుర్గమ్మ దర్శించుకున్న ఎమ్మెల్యే జారె



**కొత్తగూడెం జూన్ 22నవభూమి ప్రతినిధి:** అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, వరలక్ష్మి దంపతుల వివాహమహోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మొలుగుమాడులో ఉచిత మెగావైద్య శిబిరం





**ఏర్రుపాలెం,నవభూమి,జూన్ 22:** మండల పరిధిలోని మొలుగుమాడు గ్రామంలో ఆదివారం మెగా వైద్య శిబిరం డాక్టర్ అల్లు రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ సర్పంచ్ గంటా శ్రీనివాసరావు,డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి హాజర య్యారు.ఈ వైద్య శిబిరంలోకంటి,దంత, చర్మవ్యాధి నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ చేశారు.ఈ మెగావైద్య శిబిరాన్ని డాక్టర్ అల్లు చిన్న పుల్లారావు ఎమ్మెస్ ఆర్తో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ ఖమ్మం ఆధ్వర్యం లో నిర్వహించి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్యశిబిరంలో మలుగు మాడు పరిసర గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు ప్రముఖ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించిసమస్యఉన్నవారికిఉచితంగా మందులతోపాటుఅవసరమైనవారికి కళ్ళ జోళ్ళు పంపిణీ చేశారు.చర్మ రోగులకు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ అనిత రాణి పరీక్షలునిర్వహించిఉచితమందులు పంపిణీ చేశారు.డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో డెంటల్ సమస్య ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అంద జేశారు.ఈ కార్యక్రమండాక్టర్ అల్లు రాజ శేఖర్ తండ్రి అల్లు పెద్దపుల్లారావు జ్ఞాప కార్థం నిర్వహించారు.ఈ ఉచిత వైద్య శిబిరానికి వందలాది మంది ప్రజలు వచ్చి ఉచిత వైద్య సేవలను వినియోగించు కొన్నారు.ఈ కార్యక్రమం నిర్వహించిన డాక్టర్లను గంటా శ్రీనివాసరావు,వెల్లంకి వెంకటేశ్వర్లు,జిల్లేపల్లి బాబురావు,గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో డాక్టర్ గార్లను సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ మండల ప్రజలు ఎలాంటి వైద్యసేవలు పొందటానికైనా ఖమ్మంలోని గవర్నమెంట్ హాస్పటల్లో అందుబాటులో ఉంటామని తెలియ జేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు గ్రామస్తులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇల్లెందు వాసవి క్లబ్ సేవలు అద్భుతం

- కితాబు ఇచ్చిన చీఫ్ గెస్ట్ తోట శ్యామ్ ప్రసాద్, పెండ్యాల రోజా లక్ష్మి
- ఒకేరోజు పది సేవా కార్యక్రమాలు చేసిన ఇల్లందు వాసవి క్లబ్
- అధిక సంఖ్యలో పాల్గొన్న ఆర్యవైశ్యులు
- వాసవి క్లబ్ మినిట్స్ బుక్, స్క్రాప్ బుక్ రికార్డులు చూసి భేష్ అన్న అధికారులు











**ఇల్లెందు జూన్ 22 నవభూమి ప్రతినిధి:** ఉదయాస్తమాన సేవలు (డాన్ టు డెస్క్) ప్రోగ్రాం లో భాగంగా ఇల్లెందు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పది సేవా కార్యక్రమాలకు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వి.ఎన్ గోల్డెన్ స్టార్ కె.సి.జి.ఎఫ్ తోటా శ్యాం ప్రసాద్, గౌరవ అతిథిగా వి.ఎన్ కె.సి.జి.ఎఫ్ శ్రీమతి పెండ్యాల రోజా లక్ష్మి, రీజినల్ చైర్ పర్సన్ సీమకుర్తి రాజమనోహర్, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు ఇల్లందు వాసవి క్లబ్ వారు ఆదివారం ఉదయాన్నే హరిహర క్షేత్రంలోనీ వాసవి మాత పూజతో మొదలై గోశాలలో గరుకు స్తంభం వేసి అభిషేకం చేయడం జరిగింది. గోదానం చేసి, ఆలయ ప్రాంగణంలో జవాను వంశీ రెడ్డి, రైతు కృష్ణ కు సన్మానం చేయడం జరిగింది, పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ, ఆలయ కమిటీ చైర్మన్ గందే సదానందం కు సన్మానం చేయడం, ఆలయం కు స్టీల్ ప్లేట్ల వితరణ, డయాలసిస్ పేషెంట్ కు ఆర్థిక సహాయం, చెప్పులు కుట్టు వ్యక్తికి గొడుగు మరియు కిట్టు, ఎమ్మార్వో ఆఫీస్ నందు గల గణపతి ఆలయంలో వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్ మరియు మోటార్ వితరణ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కార్పోరేట్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ డైమండ్ స్టార్ తోట శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ఇల్లందు వాసవి క్లబ్ సేవలు అద్భుతము గా ఉన్నవి, మీ క్లబ్ కు ఇంటర్నేషనల్ లో ప్రత్యేక గుర్తింపు తప్పకుండా వస్తుందని తెలియజేశారు, క్లబ్ కు సంబంధించిన రికార్డులను పరిశీలించి అద్భుతంగా తయారు చేశారని కొనియాడారు, గౌరవ ముఖ్యఅతిథిగా కపుల్ కె.సి జి.ఎఫ్ పెండ్యాల రోజా లక్ష్మి, రీజియన్ చైర్ పర్సన్ వి.ఎన్ కే.సి జి.ఎఫ్ సీమకుర్తి రాజా మనోహర రావు, ఇల్లందు వాసవి క్లబ్ అధ్యక్షుడు బోనగిరి రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కటకం సత్యేంద్ర కుమార్, కోశాధికారి తీర్థాల నాగరాజు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుగూరి నగేష్ కుమార్, ఇల్లెందు మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, యువజన అధ్యక్షుడు నరేంద్రుల అనుబాబు, లీగల్ అడ్వైజర్ తాటిపల్లి సుబ్బారావు, వాసవి క్లబ్ ఐ.ఈ.సి ఆఫీసర్ చిథిరాల లింగయ్య, ఐ.పి.సి వ్యామసాని జనార్ధన్, వాసవి క్లబ్ ఆఫీసర్లు జొన్నల ఉపేంద్రనాథ్ గుప్తా, చంద్రుపట్ల రోశయ్య, సైఫా రాజశేఖర్, కటకం చిన్న సత్యనారాయణ, యువజన కార్యదర్శి ఓరుగంటి పవన్ పండు, రాష్ట్ర నాయకులు పసుమర్తి వాసు, కటకం బాల కృష్ణ, గౌరిషెట్టి కృష్ణ, గౌరీషెట్టి నగేష్, బోనగిరి రమేష్, రామిడి శంకర్, చిక్క శ్రీను, పుల్లకండ సుబ్బారావు, యం. నరసింహారావు, కటకం రేణుక దేవి, చిక్కా త్రివేణి, కటకం అలేఖ్య, బోనగిరి కల్పన, కటకం ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో ఇల్లందు అభివృద్ధి జరగాలి

## మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్



**ఇల్లెందు జూన్ 22 నవభూమి ప్రతినిధి:** ఇల్లెందు ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ బలరాం నాయక్ కృషితో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో జరగాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫారెస్ట్ గ్రౌండ్ న్యాయస్థానం నిర్మాణానికి కాకుండా ఏజెన్సీ ప్రాంతమైన ఇక్కడ క్రీడాకారుల కోసం స్థానిక యువత విద్యార్థులకు భవిష్యత్తు తరాలకు వినియోగం అయ్యేలా చూడాలన్నారు. తమ హయాంలో 120 కోట్ల అభివృద్ధి పనులు తీసుకువచ్చి ఇల్లందు పట్టణ అభివృద్ధికి కృషి చేశామన్నారు. 373 జీవో అనుసంధానం చేసి జీవో 224 ప్రకారం పట్టణంలో 2024 వరకు నిర్మాణాలు నిర్మించుకున్న వారికి లోన్లు వచ్చేలా ఇవ్వాలన్నారు. సింగరేణి సంస్థ మూతబడిన గనులను మట్టితో నింపి భవిష్యత్తు అవసరాలకు వినియోగం అయ్యేలా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం చేసుకునేలా మున్సిపాలిటీకి అప్పగించాలన్నారు. పట్టణ పరిధిని

# నేడు మధిర నుండి జమలాపురం విజయవాడ బస్సుసర్వీస్ ప్రారంభం




**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 22:** మధిర ఆర్టీసీ డిపోనుండి జమలాపురం మైల వరం మీదుగా విజయవాడ వెళ్లేందుకు నేడు సోమవారం నుండి బస్ సర్వీస్ ప్రారంభిస్తున్నట్లు మధిర డిపో మేనేజర్ శంకర్రావు తెలిపారు. తెలంగాణ తిరుపతి గా ప్రసిద్ధిగాంచిన జమలాపురం గ్రామానికి ఆంధ్ర బస్సులే దిక్కు.తెలంగాణ ప్రాంతం నుండి ఆర్టీసీ బస్సులు లేవని అన్ని పత్రికలలో గత కొన్ని సంవత్సరాలుగా వార్తలు రావడంతో నేడు సోమవారం మధిర డిపో పరిధిలో గల జమలాపురం నుండి మైలవరం మీదుగా విజయ వాడకు కొత్త బస్సు ఎక్స్ ప్రెస్ సర్వీస్ ను ప్రారంభి స్తున్నారు.ఈ బస్సు ప్రతిరోజు మధిరలో ఉదయం 6 గంటలకు బయలుదేరి జమలాపురం -మైల వరం మీదుగా విజయవాడ మెయిన్ బస్టాండ్ కు 8.15 గంటలకు చేరుకొని తిరిగి విజయవాడలో 8.30 గంటలకు బయలుదేరి మైలవరం- జమలా పురంమీదుగామధిరకు ఉదయం 10.45 గంటలకు చేరుకొంటుందఅని డిపో మేనేజర్ శంకరరావు తెలిపారు. తిరిగి మధిరలో ఉదయం 11 గంటలకు బయలుదేరి అదే రూట్ లో విజయవాడ వెళ్లి అక్కడి నుండి మధ్యాహ్నం1.30 గంటలకు బయలుదేరి అదే రూట్లో 3.45 గంటలకు మధిరకు చేరుకొంటుందన్నారు. తిరిగి మధిరలో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి జమలాపురం -మైలవరం మీదుగా విజయవాడకు 6.15 గంటలకు చేరుకొం టుంది.తిరిగివిజయవాడలో6.30 గంటలకు బయలుదేరి అదే రూట్ లో మధిరకు 8.45గంటలకుచేరుకొంటుందని డిఎం శంకర్రావు తెలిపారు.కావున ఇట్టి నూతన సర్వీస్ ను ఈ రూటు ప్రాంతం లోని ప్రజలు సద్వినియోగం చేసుకోని ఆర్టిసి సంస్థను బోలోపేతం చేయాలని ఆయన కోరారు.

# రప్పా రప్పా.. ఫ్లెక్సీలతో షో చేస్తే భయపడతామా?

**నకిరేకల్-నవభూమి:** మాజీ మంత్రి హరీశ్‌రావు 'రప్పారప్పా' ఫ్లెక్సీలతో షో చేస్తే భయపడే వారు ఎవరూ లేరని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చేసిన పాపాలు బయటపడుతుండటంతో ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే బనకచర్ల ప్రాజెక్టుపై హరీశ్‌రావు రప్పా.రప్పా.. ఫ్లెక్సీలతో షో చేశారని ఎద్దేవా చేశారు. బనకచర్ల పాపం బీఆర్ఎసదేనని, ఆ ప్రాజెక్టుకు 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో ఇచ్చిందని పొంగులేటి గుర్తు చేశారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో నియోజకవర్గానికి చెందిన 3,500 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆదివారం ఇంటి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో పొంగులేటి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో చేసిన పాపాలు బయటపడుతుండటంతో ఆ అంశాన్ని పక్కదారి పట్టించేలా బనకచర్ల ప్రాజెక్టుపై హరీశ్‌రావు రప్పా...రప్పా.. ఫ్లెక్సీలతో షో చేస్తే భయపడే వారెవరూ లేరన్నారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేస్తే కమీషన్లు రావనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాళేశ్వరం కట్టారని పొంగులేటి ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అంటూ ప్రచారం ఆర్భాటంతో సరిపెట్టిన బీఆర్ఎస్ సింగిల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా కట్టించలేదని విమర్శించారు. తల తాకట్టు పెట్టైనా ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని పొంగులేటి పేర్కొన్నారు. తొలి విడతగా 4.50లక్షల ఇళ్లను మంజూరు చేశామని వచ్చే నాలుగేళ్లలో 16లక్షల మందికి ఇళ్లను నిర్మిస్తామన్నారు. ఇక, సీఎం హోదాలో కేసీఆర్ చేసిన మొక్కులను సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు చెల్లిస్తున్నారని పొంగులేటి చమత్కరించారు. భద్రాచల దేవస్థానం అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తాని మాట ఇచ్చిన కేసీఆర్ రూ.100 కూడా ఇవ్వలేదన్నారు. కానీ, దేవస్థానం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే రూ.80 కోట్ల మేర నిధులు విడుదల చేశారని చెప్పారు. కాగా, భూ భారతి ద్వారా వచ్చిన 8.60లక్షల అర్జీల్లో న్యాయపరమైన చిక్కుల్లేని వాటిని వచ్చే ఆగస్టు నాటికి పరిష్కరించి రైతులకు స్వాతంత్ర్యం కల్పిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గం రాజకీయ నాయకుల ఉత్పత్తి కేంద్రంగా మారిందన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు ఈ సభలో పాల్గొన్నారు.